సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 23 । జూలై । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.9 /22.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా యువజన, క్రీడల అధికారిగా జగన్నాథం



కామారెడ్డి క్రైం: జిల్లా యువజన, క్రీడల సర్వీసుల శాఖ అధికారిగా కెఎస్. జగన్నాథం నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డిలో పనిచేసిన దామోదర్‌రెడ్డి మెదక్ జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో పనిచేసిన జగన్నాథం జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాణా ప్రతాప్



కామారెడ్డి రూరల్: ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడా హక్కుల పోరాట సమితి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన పాతులోత్ రాణా ప్రతాప్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర కమిటీలో అవకాశం ఇచ్చిన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు కండక్టర్లపై చార్జిషీట్


బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కండక్టర్లపై ఉన్నతాధికారులు చార్జిషీట్లు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ ఆర్టీసీ డిపోలో కార్మికులకు సెలవుల మంజూరు విషయంలో అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై సంస్థ ఉన్నతాధికారులకు కార్మికులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు వెళ్లింది. దీంతో విజిలెన్స్, ఆర్టీసీ అధికారులు బాన్సువాడ డిపోలో వారం పాటు విచారణ జరిపి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. వాటి ఆధారంగా ఈనెల 9న అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా డబ్బుల వసూళ్లలో అసిస్టెంట్ మేనేజర్‌కు ఇద్దరు కండక్టర్లు సహకరించినట్లు తెలిసింది. అసిస్టెంట్ మేనేజర్‌కు బినామీలుగా వ్యవహరించారనే అనుమానంతో ఈ ఇరువురి ఫోన్‌లు, ఇతర లావాదేవీలను ఆర్టీసీ ఉన్నతాధికారులు పరిశీలించారు. కార్మికులకు సెలవులు మంజూరు చేయడానికి వీరిలో ఓ కండక్టర్ ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరు కండక్టర్లకు ఈనెల 12న చార్జీషీట్లు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం బాన్సువాడ ఆర్టీసీ డిపోలో కలకలం సృష్టిస్తోంది.

బ్యాంకుల్లో పెరిగిన రద్దీ



నిజాంసాగర్: పంట రుణాల మాఫీతో బ్యాంకుల్లో రద్దీ పెరిగింది. ప్రభుత్వం రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేయడంతో డబ్బుల కోసం రైతులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలకేంద్రాలలోని బ్యాంకుల వద్ద బారులు కనిపిస్తున్నాయి. రుణమాఫీ సొమ్ము ఇవ్వడానికి వన్‌బీతో పాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుంటుండడంతో మీసేవ కేంద్రాలతోపాటు జిరాక్స్ కేంద్రాలు కళకళలాడుతున్నాయి.

నిర్మలమ్మ కరుణ చూపేనా..?



కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రైల్వేలైన్ డబ్లింగ్‌తో పాటు కొత్త రైల్వే లైన్ మంజూరవుతాయని ఆశిస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా అవసరాలపై చర్చించుకుంటున్నారు.

- ముందుకు సాగని 'డబ్లింగ్'!
- కలగానే బీబీబీ రైల్వే లైన్
- కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసుల్లో ఆశలు

సాక్షి, కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మీదుగా నిత్యం పదుల సంఖ్యలో రైళ్లు ప్రయాణిస్తాయి. అయితే సింగిల్ లైన్ మాత్రమే ఉండడంతో ఇబ్బంది అవుతోంది. ఒక రైలు వస్తోందంటే ఇంకో రైలును సమీపంలోని స్టేషన్‌లో ఆపాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణికుల సమయం వృథా అవుతోంది. ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య ప్రధాన రైల్వేలైన్‌గా ఉన్న సికింద్రాబాద్ -నాందేడ్ రూట్‌కు సంబంధించి ముత్కేడ్-డోన్ మధ్య 417.88 కి.మీ. రైల్వే లైన్ డబ్లింగ్ కోసం రూ. 4,686.09 కోట్లు అవసరం అవుతాయని గతేడాది రైల్వే శాఖ వెల్లడించింది. రైల్వే లైన్ డబ్లింగ్‌కు కేంద్రం అనుమతిచ్చిన నేపథ్యంలో ఈసారి నిధులు కేటాయిస్తారా అన్నదానిపై ఆసక్తి ఉంది. ఈ మార్గంలో డబ్లింగ్ పూర్తయితే మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని నాందేడ్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, కర్నూలు జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

బోధన్ - బాన్సువాడ - బీదర్ లైన్..

బోధన్ -బాన్సువాడ -బీదర్(బీబీబీ) రైల్వే లైన్ దశాబ్దాలుగా ప్రకటనలకే పరిమితమైంది. బోధన్ నుంచి బాన్సువాడ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వరకు దాదాపు 140 కిలోమీటర్ల దూరం రైల్వేలైన్ వేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు దశాబ్దాలుగా పాలకులను కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఇదొక ప్రచారాంశంగా ఉంటుంది. అయితే నేతలు హామీలు ఇవ్వడం, బడ్జెట్ సమయంలో నిధుల కోసం వినతులు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. దశాబ్దాల కలను నెరవేర్చేందుకు ఏ ఒక్కరూ గట్టిగా ప్రయత్నించిన దాఖలాలు లేవు. దీంతో ఈ రైల్వేలైన్ కలగానే మిగిలిపోయింది. రైల్వే లైన్ చేపట్టేందుకు గతంలో సర్వేలు చేసినా నిధులు రాకపోవడంతో పనులు మొదలు కాలేదు. అలాగే 44వ నంబర్ జాతీయ రహదారి వెంట డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్ వరకు అక్కడి నుంచి నాగ్‌పూర్‌కు రైల్వేలైన్ ఏర్పాటైతే దేశ రాజధాని ఢిల్లీకి దూరం తగ్గుతుంది. ఈ లైన్ ఏర్పాటు కోసం ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉన్నా ఇప్పటికీ ప్రతిపాదనల దశ దాటడం లేదు.

రైల్వే క్రాసింగ్‌లు, గేట్లతో ఇబ్బందులు

జాతీయ రహదారిపై రైల్వే క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జీలు నిర్మించకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కామారెడ్డి పట్టణానికి సమీపంలోని నర్సన్నపల్లి వద్ద బ్రిడ్జి లేకపోవడంతో కామారెడ్డి పట్టణం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. అలాగే కామారెడ్డి పట్టణాన్ని రైల్వేలైన్ రెండుగా చీలుస్తుంది. పట్టణంలో ఒక్కటే రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉండడం, అది కూడా ఇరుకుగా మారడంతో పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మరో రెండు చోట్ల బ్రిడ్జీలు నిర్మించాలన్న డిమాండ్ ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయాలకు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉంటుంది. ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో రైలు వచ్చినప్పుడల్లా గేటు వేస్తుంటారు. అరగంటకోసారి రైల్వే గేటు పడుతుండడంతో గేటు మీదుగా వెళ్లే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఈసారి ఆయా అంశాలకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టే బడ్జెట్‌పై జోరుగా చర్చించుకుంటున్నారు.

'బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని పూర్తి చేయాలి'



ఐకేపీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఐకేపీ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తిలో భాగంగా గుర్తించిన అన్ని రకాల రుణాలను గ్రౌండింగ్ చేయాలన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో చందర్ నాయక్, డీపీఎంలు రమేష్, రవీందర్, సుధాకర్, వకుళ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కామారెడ్డి క్రైం: రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌పుట్ డీలర్లుగా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన జిల్లాలోని 40 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రంగంలో సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన పెంపొందించడం, మెరుగైన సేవలందించడం, పారా ఎక్స్‌టెన్షన్ నిపుణులుగా వ్యవహరించడం కోసం పురుగు మందులు, విత్తనాల దుకాణాల డీలర్లకు డిప్లొమా కోర్సు ప్రవేశపెట్టారన్నారు. కోర్సు పూర్తి చేసినవారు పంటల సాగులో రైతులకు మెలకువలు నేర్పించాలన్నారు. నాణ్యమైన పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



డీలర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్

దైవంపై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం



మాట్లాడుతున్న పవన్‌కుమార్ శర్మ

కామారెడ్డి అర్బన్: కలియుగ దైవం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరె కృష్ణ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని హైందవ ధర్మ రక్షక దళ్ వ్యవస్థాపకులు యజ్ఞం పవన్‌కుమార్ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణ, హిందూ సంస్థల ప్రతినిధులు కులకర్ణి చక్రధర్, గంగారెడ్డి, విశ్వంగుప్తా, రాచర్ల సంతోష్, నర్సింలు, శ్యామ్ తదితరులు కలిసి విలేకరులతో మాట్లాడారు. కదిరె కృష్ణ వ్యాఖ్యలను ఖండించారు. దేవీదేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్ప ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. కుంటలు, చెరువులు, ప్రాజెక్టుల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 620 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,387.80 అడుగుల(3.225 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

సింగితంలోకి..

నల్లవాగు మత్తడి వరద నీటితో పొంగిపొర్లుతోంది. సింగితం రిజర్వాయర్‌లోకి సోమవారం 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.50 మీటర్లు కాగా.. సోమవారం సాయంత్రానికి 415.690 మీటర్ల నీరు నిల్వ ఉంది.

లింగంపేట: ఎగువన కురిసిన వర్షాలతో లింగంపేట సమీపంలోని పెద్దవాగు ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని కుంటలు, చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి.



వరద నీటితో పొర్లుతున్న నల్లవాగు మత్తడి



సింగితం రిజర్వాయర్‌లో నీటిమట్టం



ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



సింగితం వాగులో వరద ప్రవాహం

'పోచారం'లోకి 2,767 క్యూసెక్కులు..



నాగిరెడ్డిపేట: డెడ్‌స్టోరేజీకి చేరిన పోచారం ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. గాంధారి, లింగంపేట ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. లింగంపేట, గుండారం వాగులద్వారా సోమవారం ఉదయం 42 క్యూసెక్కులు రాగా.. మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో 6,732 క్యూసెక్కులకు పెరిగింది. కాగా సాయంత్రానికి ఇన్‌ఫ్లో 2,767 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెకు పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా.. సోమవారం సాయంత్రానికి 0.257 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కళ్యాణి ప్రాజెక్ట్ రెండు గేట్ల ఎత్తివేత



ప్రాజెక్టు గేట్ల ద్వారా ప్రవహిస్తున్న నీరు

ఎల్లారెడ్డి : కళ్యాణి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం రెండు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 409.5 అడుగుల నీరు నిల్వ ఉందని, వరద గేట్ల నుంచి 450 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి వదులుతున్నామని తెలిపారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు
జిల్లా అంతటా వరినాట్లు ముమ్మరం



కామారెడ్డిలో నారు తీస్తున్న కూలీలు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే ఆలస్యంగానైనా జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నిన్న మొన్నటి వరకు లోటు వర్షపాతం ఉన్న ప్రాంతాలన్నింటా పరిస్థితి కొంత మెరుగుపడింది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. కేజీవీల్స్ ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేసి నాట్లకు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3.15 లక్షల ఎకరాల్లో నాట్లు వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటివరకు 70 వేల ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లక్ష్యానికి అనుగుణంగా వరి సాగవుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటల్లోకి ఇప్పుడిప్పుడే వరద రావడం మొదలైంది. మరో నాలుగైదురోజులు వర్షాలు కురిస్తే ప్రాజెక్టులతో పాటు చెరువులు కళకళలాడే అవకాశాలున్నాయి.

రాంగ్‌రూట్‌లో వెళ్తే కేసులే..

- బైక్‌పై ఫోన్ మాట్లాడినా కఠినచర్యలు
- నగరంలోని 18 చోట్ల స్పెషల్ డ్రైవ్‌లు
- ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఖలీల్‌వాడి: వాహనాలను రాంగ్‌రూట్‌లో నడిపినా, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నగరంలోని 18 చోట్ల ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందు కోసం కావాల్సిన సిబ్బందిని సీపీ కేటాయించారని తెలిపారు. నగరంలోని వాహనాదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. అత్యవసరంగా ఫోన్ ఎత్తాల్సి వస్తే రోడ్డుపక్కన నిలిపి మాట్లాడాలని సూచించారు. మొదటి రోజు సోమవారం ఐదుచోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మంగళవారం నుంచి 18 చోట్ల స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

నగరంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించే 18 ప్రదేశాలివే..

- కుమార్‌గల్లి - గాంధీచౌక్
- శ్రీదేవి టాకీస్ - పులాంగ్
- పూసలగల్లి - మమత పాయింట్
- ఎల్‌వీఆర్ - మమత పాయింట్
- ఖలీల్‌వాడి - జీజీహెచ్, బస్టాండ్
- ఓల్డ్ మనోరమ హాస్పిటల్ - సాయిమెస్
- బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ - హరిచరణ్‌మార్వాడీ స్కూల్
- పోలీస్ కమిషనరేట్ - నిశిత కాలేజ్
- జెడ్పీ ఆఫీస్ - డీఐజీ ఆఫీస్
- కంఠేశ్వర్ టీజంక్షన్ - కంఠేశ్వర్ శివాలయం
- చంద్రశేఖర్ కాలనీ - కంఠేశ్వర్ టీజంక్షన్
- గూపన్‌పల్లి కమాన్ ఎదుట - కృష్ణ మందిర్ ఆలయం
- శ్రీరామ గార్డెన్ - గంగాస్థాన్ ఫేస్-2
- ఎల్లమ్మగుట్ట - ప్రగతిహాస్పిటల్
- ఇండియన్ ఆయిల్ పంప్ - పులాంగ్
- పాస్‌పోర్టు ఆఫీస్ - ప్రగతిహాస్పిటల్ జంక్షన్
- ఇండియన్ పెట్రోల్ పంపు - ఆర్ఆర్ చౌరస్తా
- మాలపల్లి చౌరస్తా - బోధన్ రోడ్డు

అరటిపళ్ల కుప్ప.. ఎగబడ్డ జనం



నల్లూర్ శివారులో కుప్పగా పోసిన అరటి పళ్లను ఏరుకుంటున్న జనం

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారు జాతీయ రహదారి 44 పక్కన అరటి పళ్లు పెద్ద మొత్తంలో కుప్పగా పడి ఉండటంతో అటు వైపు వెళ్లే జనాలతో పాటు నల్లూర్, ముప్కాల్ గ్రామానికి చెందిన వారు ఎగబడ్డారు. ఆ అరటి పళ్లు ఎందుకు అక్కడ వదిలేసి వెళ్లారో ఎవరికీ అర్థం కావడం లేదు. కాని జనాలు మాత్రం సంచుల్లో, బకెట్లలో నింపుకెళ్లారు. కొందరు జాతీయ రహదారి పక్కన ఉన్న కోతులకు పంచిపెట్టారు. అరటి పళ్ల లోడు బోల్తా పడ్డట్లు ఆనవాళ్లు లేవు. కాని కుప్ప పోసి వెళ్లారు.

క్లుప్తంగా

బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఆగస్టు 1 వరకు చెల్లించాలని కంట్రోలర్ రుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 2వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

పీజీ పరీక్ష ఫీజు..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2, 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఆగస్టు 5వ తేదీ వరకు చెల్లించాలని కంట్రోలర్ అరుణ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 8వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

పీజీ పరీక్షల్లో 13 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో సోమవారం 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 14 మంది విద్యార్థులకు 14 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 89 మంది విద్యార్థులకు 76 మంది పరీక్ష రాశారని వివరించారు.

31 నుంచి పీజీ ఎగ్జామ్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సుల బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈనెల 31న ప్రారంభమై ఆగస్టు 14 వరకు కొనసాగుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 1, 3, 4, 7, 9వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 31 న ప్రారంభమవుతాయన్నారు. పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఆగస్టు 6 నుంచి 16వరకు కొనసాగుతాయని వివరించారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులకు ఈ షెడ్యూల్ వరిస్తుందన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం (20వ రోజు) ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గానూ ముగ్గురు హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 22 మంది విద్యార్థులకు 21 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం జిల్లాలోని ప్రతి పాఠశాల ఐదు నామినేషన్లు పంపించాలని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉత్తమమైన ప్రాజెక్టులను నామినేషన్లకు పంపాలని సూచించారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 91 ఫిర్యాదులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశాలు



కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నేలపై కూర్చుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షులు ఇందిర, కార్యదర్శి రాజశ్రీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్లను పర్మనెంట్ చేస్తామని తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా ఆశా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కరించలేదన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. నాయకులు మంజుల, పద్మ, రేణుక, గంగామణి, సుధ, భాగ్యలక్ష్మి, ప్రమీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్


ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి, పెద్ద కొడప్‌గల్ తహసీల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు రహీమొద్దీన్, దశరథ్‌లు మాట్లాడుతూ.. ఈ ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారన్నారు. ఈ ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఏవో శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి రాంచంద్రం, ఏపీఎం రవీందర్, పర్యవేక్షణ అధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు


సిర్పూర్ సమీపంలో ప్రవహిస్తున్న మంజీర వాగు


పెద్ద ఎక్లార గేటు సమీపంలో ..

రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వానా కాలం ప్రారంభమైన సుమారు నెలన్నర తర్వాత భారీ వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


పెద్దకొడప్‌గల్: బేగంపూర్ చౌరస్తా నుంచి బేగంపూర్ వెళ్లే దారిపై వరద నీరు


కృష్ణాజీవాడి శివారులోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వర్షపు నీరు


బాన్సువాడలో ఉధృతంగా పెద్ద వాగు

దరఖాస్తుల స్వీకరణ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ జీపీలో సోమవారం స్థానిక ఏఈవో మధుసూదన్ రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. రైతులు పట్టాదారు పాసుబుక్కులు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కులతో రావాలని ఆయన సూచించారు.

ఆపదలో ఉంటే షీటీంకు ఫోన్ చేయాలి


పెద్ద ఎక్లార గురుకులలో అవగాహన కల్పిస్తున్న కళాబృందం

మద్నూర్(జుక్కల్): ఆడ పిల్లలు ఆపదలో ఉంటే వెంటనే షీటీంకు ఫోన్ చేస్తే పోలీసులు వచ్చి కాపాడుతారని పోలీసు కళాబృందం సభ్యులు వివరించారు. పెద్ద ఎక్లార గేటు వద్ద జాతీయ రహదారిపై గల బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం పోలీసు కళాబృందం వారు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కళాకారులు ఆటపాటలతో విద్యార్థులకు పలు సూచనలు అందించారు. షీటీం గురించి, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీం ఫోన్ నెంబర్ 8712686094, సైబర్ నేరాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్లు 100, 108, 1930, 181కు ఫోన్ చేయాలన్నారు. కళాబృందం సభ్యులు, మద్నూర్ ఏఎస్సై సుధాకర్, సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి రూరల్/లింగంపేట: అర్హులైన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి రూరల్, లింగంపేట మండల వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌రావు, అనిల్ కుమార్‌లు తెలిపారు. జూన్ 28 వరకు నూతనంగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు గల రైతులు బీమాకు అర్హులని, వారు 2024–25 సంవత్సరానికి గాను బీమా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీమా నమోదు చేసుకున్న రైతు మరణిస్తే రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు నామినీకి ఇస్తుందన్నారు. రైతులు బీమా దరఖాస్తు ఫారం నింపి దానితో పాటు నూతనంగా వచ్చిన పట్టా పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, ఒకవేళ నామిని 18 సంవత్సరాలకు తక్కువగా ఉంటే అపాయింటీ ఆధార్ కార్డు, ఆయా ధృవపత్రాల జిరాక్సులు బీమా ఫారంతో ఆగస్టు 1లోపు జత చేసి వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని వారు కోరారు. గతంలో నమోదు చేసుకున్న రైతుల బీమా యథావిధిగా కొనసాగుతుందన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న జీవీఎం విఠల్

కామారెడ్డి రూరల్: త్వరలో జరగబోతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ప్రధానంగా విద్యారంగ సమస్యలపైన చర్చించాలని భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం) రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ నాయకులు విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం చేశారని, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం, గురుకులాల సమస్యలు పట్టించుకోకపోవడం వసతి గృహాలను అభివృద్ధి చేయకపోవడం, యూనివర్సిటీలను గాలికి వదిలేయం లాంటివి చేశారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయకూడదని హితవు పలికారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ఎలాంటి షరతులు పెట్టకుండా విడుదల చేయాలన్నారు.

పంటల పరిశీలన



రుద్రూర్: పొతంగల్ మండలం టాక్లీ, సోంపూర్, దోమలెడ్గి, కోటగిరి మండలం ఎత్తొండ గ్రామాల్లో సోమవారం రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తున్నందున మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావులో కలిసి కలిసి పంటలను పరిశీలించారు. సోయా పంట కొద్దిగా లేత పసుపు వర్ణంలోకి మారినట్లు గుర్తించి చేనులో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. 19:19:19 ఎరువు 10 గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.నరేందర్, ఏ.కృష్ణ చైతన్య, ఏ.దినేష్, జి.రవీందర్ పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి



ఖలీల్‌వాడి: జిల్లాలో నలుగురు కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. సోమవారం సీపీ కార్యాలయంలో పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు సీపీ కల్మేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కానిస్టేబుళ్లు బి.కిషన్, సి.అజయ్ కుమార్(వన్ టౌన్), బి.సురేష్(మోర్తాడ్ పీఎస్), సీఎస్‌బీలో పని చేస్తున్న ఎస్ రవికాంత్ పదోన్నతి పొందారు.

ముప్కాల్‌లో పట్టపగలే చోరీ



బాల్కొండ: ముప్కాల్‌లోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీలోకి చెందిన తాడూరి లింబాద్రి దుబాయిలో ఉంటాడు. ఆయన భార్య ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో ఉన్న పాత ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భాస్కరాచారీ పరిశీలించారు. ఇంట్లోని తొమ్మిది తులాల బంగారం పోయినట్లు పోలీసులు తెలిపారు.

కాపర్‌వైర్, ఆయిల్..

నవీపేట: నవీపేట శివారులోని రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి దుండగులు కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారని లైన్‌మెన్ కృష్ణ సోమవారం ఫిర్యాదు చేశాడు. 100కేవీ, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

హత్య చేసి.. పూడ్చి పెట్టారు!

క్రైం కార్నర్

- పాత కక్షలతో గొర్రెల కాపరి హత్య
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు!


మల్లయ్య(ఫైల్)

కామారెడ్డి క్రైం: పాత కక్షల నేపథ్యంలో ఓ గొర్రెల కాపరి హత్యకు గురయ్యాడు. ఓ మిస్సింగ్ కేసు విచారణలో భాగంగా హత్య ఉదంతం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జీర్ల చిన్న మల్లయ్య(52) గొర్రెలను కాస్తు జీవనం సాగిస్తున్నాడు. వారం క్రితం నుంచి అతడు కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 19న మిస్సింగ్ కేసు నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అతడిని హత్య చేసినట్లు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది.

కుమారుడి ఆత్మహత్యతో..

మల్లయ్య కుమారుడు ప్రవీణ్(22) రెండు నెలల క్రితం గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులేనని అనుమానం వ్యక్తం చేస్తూ మల్లయ్య పలు సార్లు వారితో వాగ్వాదానికి దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో వారి మధ్య కక్షలు పెరిగాయని భావిస్తున్నారు. గాయత్రి షుగర్ ఫ్యాక్టరి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా మల్లయ్య అదృశ్యమైన రోజు గొర్రెలను మిషన్ భగీరథ ప్లాంటు సమీపంలోని ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్తుండగా అతడిని సదరు ఇద్దరు యువకులు అనుసరించినట్లు రికార్డు అయింది. కాల్ డేటా ఆధారంగా మరో యువకుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. మల్లయ్యను నిర్మానుష్య ప్రదేశంలో హత్య చేసి అక్కడే గోతి తీసి పాతి పెట్టినట్లు తెలుస్తోంది. సోమవారం రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని గుర్తించే పని వాయిదా పడినట్లు సమాచారం. పోలీసులు మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని వదల్‌పర్తి గ్రామానికి చెందిన మంగలి దుర్గయ్య(62) సోమవారం హైదరాబాద్‌లోని గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలు.. దుర్గయ్యకు కొంతకాలం క్రితం పక్షవాతం రావడంతోపాటు మతిస్థిమితం కొల్పోయి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో దుర్గయ్య భార్య గోపమ్మ ఆదివారం ఉదయం కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆయన ఇంట్లో కిందపడి అవస్థపడుతూ రోప్పుతు ఉన్నాడు. దీంతో ఏమైందని అడగగా తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో దుర్గయ్యను చికిత్స నిమిత్తం స్థానికుల సహాయంతో గోపాల్‌పేటలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఖాతాదారుల సొమ్ముతో 'స్టాక్స్'లో పెట్టుబడి..!

- యూనియన్ బ్యాంక్ మేనేజర్ నిర్వాకం
- నిందితుడికి హైదరాబాద్‌లో రూ. 1.20 కోట్ల ఇల్లు
- పోలీసుల విచారణలో వెలుగులోకి ఆసక్తికర విషయాలు

ఖలీల్‌వాడి: పెద్దబజార్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఖాతాదారుల నుంచి డబ్బు కాజేసిన కేసులో ఆసక్తికర అంశాలు వెలుగుచూస్తున్నాయి. ఖాతాదారుల నుంచి నిధులను మళ్లించిన మేనేజర్ అజయ్ స్టాక్‌మార్కెట్‌లో పెట్టినట్లు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. నిందితుడిని ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసు బృందం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడిని విచారణలో భాగంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టిన పెట్టుబడి, ఎలాంటి సంస్థల్లో ఇన్వెస్ట్ చేశాడనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఇతర చోట్ల ఏమైనా దాచి పెట్టారా అనే కోణంలోనూ విచారిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులకు మాత్రం విచారణలో స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పెట్టానని చెబుతున్నట్లు తెలుస్తోంది. తనకు హైదరాబాద్‌లో రూ. 1.20 కోట్ల విలువ చేసే ఇల్లు ఉందని, మరే ఇతర ఆస్తులు లేవని.. ఇల్లుపై రూ. 90 లక్షల లోన్ ఉందని చెప్పినట్లు సమాచారం. దీంతో పాటు ఖాతాదారుల నుంచి లోన్లు, వ్యక్తిగతంగా తీసుకున్న అప్పులకు సంబంధించిన వివరాలను అడిగినట్లు తెలుస్తోంది. అయితే ఖాతాదారుల గోల్‌మాల్ వ్యవహారం కొలిక్కి రావడానికి సమయం పట్టే అవకాశం ఉంది.

పసుపులారీ ఎత్తుకెళ్లిన కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆర్టీఏ అధికారుల పేరుతో ఈ నెల 17న పసుపు లారీని ఎత్తుకెళ్లిన ఘటనలో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. పసుపు లారీని హైజాక్ చేసి నిందితులు జన్నేపల్లికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి నాలుగు ట్రాలీ ఆటోల్లో పసుపును నిజామాబాద్ మార్కెట్‌కు తరలించి అమ్మారు. వచ్చిన డబ్బులను ప్రధాన నిందితుడు సాదుల్లా చెప్పిన ఇద్దరికి అందించారు. అందులో నిందితుడిగా ఉన్న తౌఫీక్ అలీని సోమవారం నవీపేట్‌లో అదుపులోకి తీసుకొని, రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. తౌఫీక్ అలీకి నవీపేట్ మండలం జన్నేపల్లిలో ఇనుపసామాను దుకాణం ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో చెప్పారు. ప్రధాన నిందితుడు సాదుల్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఒకరి అరెస్ట్

కామారెడ్డి క్రైం: పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. అశోక్‌నగర్ కాలనీకి చెందిన కుంబాల రాజేశ్‌యాదవ్ కొంతకాలంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి పట్టణంలో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం ఉదయం కామారెడ్డి బస్టాండ్ వద్ద అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 740 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరుపగా నేరం అంగీకరించాడని ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుడిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇదివరకే ఎనిమిది కేసులు ఉన్నాయన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

దోమకొండ: దోమకొండలో సోమవారం విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య(65) రోజువారి కూలీగా మేస్త్రీ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా బల్బ్‌ను బిగించే క్రమంలో కరెంట్ షాక్ తగిలింది. వెంటనే స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన మిగతా కార్మికులు వెంటనే అతడిని దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

బోధన్ రూరల్: సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్‌లో ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. సాలంపాడ్ క్యాంప్‌లో కోట శ్రవన్‌రెడ్డి ఇంట్లో తులం బంగారు గాజులు, రూ.2వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. సోమవారం మండలంలోని నాగన్‌పల్లి శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో నుంచి వి రాజు, సీహెచ్ రాజు పారిపోతుండగా పట్టుకుని విచారించారు. సాలంపాడ్ క్యాంప్‌లో తామే చోరీ చేసినట్లు వారు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగనాథ్ పేర్కొన్నారు.

ఆగని కేబుల్ వైర్ల చోరీ

బాల్కొండ: బోరుబావులు, పంపుసెట్ల కేబుల్ వైర్ల చోరీలు ఆగడం లేదు. తాజాగా ముప్కాల్ మండలం రెంజర్లలో ఆదివారం రాత్రి బోరు బావుల నుంచి, కాకతీయ కాలువపై అమర్చుకున్న పంపు సెట్ల నుంచి కేబుల్ ఎత్తుకెళ్లారు. 15 రోజుల క్రితం కేబుల్ వైర్ల చోరీలు భారీగా జరిగాయి. దొంగలు వైర్లు ఎత్తుకెళ్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైర్‌తో పాటు, కొన్ని మోటార్ల స్టార్టర్లు కూడా ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం సాగుకు నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. ఈ సమయంలో కేబుల్, స్టార్టర్లు ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చోరీలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.